ప్రజాశక్తి

బుధవారం 19 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

40 రోజులు.. రూ.69.92 కోట్లు

◆ నిర్ణీత గడువులోగా పల్లె పండగ రోడ్లు పూర్తయ్యేనా ? ◆ నెమ్మదిగా నిర్మాణ పనులు

◆ సకాలంలో పూర్తిచేయకుంటే నిధులు వెనక్కు..

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) మెటీరియల్ నిధులతో గ్రామాల్లో పల్లె పండగ కింద చేపట్టిన కొత్త రహదారుల నిర్మాణాలు పూర్తిచేయడానికి గడువు సమీపిస్తోంది. రానున్న నలభై రోజుల్లో రూ.69.92 కోట్లను రహదారుల పనులకు ఖర్చు చేయాల్సివుంది. మంజూరైన నిధులను మార్చి 31లోపు వినియోగిం చకపోతే ఆ నిధులు వెనక్కు వెళ్లనున్నాయి.



అనకాపల్లి మండలం శంకరంలో వేసిన సిసి రోడ్డు

పల్లె పండగ కింద జిల్లాలో 224.91 కిలోమీటర్ల పొడవులో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, డబ్ల్యుబిఎం రోడ్ల నిర్మాణాలకు రూ.147.92 కోట్లు మంజూరయ్యాయి. మూడు రకాల రహదారుల నిర్మాణాలను మార్చికి పూర్తిచేయాల్సివుంది. ఆర్థిక సంవత్సరం గడువు దగ్గర పడుతున్నప్పటికీ నిర్మాణాలు చివరకు రాలేదు. గతేడాది అక్టోబర్‌లో పనులు ప్రారంభించినా పనుల్లో పెద్ద ప్రగతి కనిపించడంలేదు. 224.91 కిలోమీటర్ల రహదారి లక్ష్యంలో ఇంతవరకు 117.26 కిలోమీటర్లలో రోడ్లు వేశారు. మరో 81.09 కిలోమీటర్లలో రహదారుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మంజూరైన నిధుల్లో 53 శాతం విలువైన పనులు జరిగాయి. మంజూరైన రూ.147.92 కోట్లలో రూ.78 కోట్లు వినియోగించారు. రానున్న నలభై రోజుల్లో రూ.69.92 కోట్లు ఖర్చు చేయాల్సివుంది.

మూడు రకాల రోడ్ల నిర్మాణాలు ఇలా..

జిల్లాలోని 24 మండలాలు, 245 పంచాయతీల పరిధిలో పల్లె పండగ కార్యక్రమం కింద రూ.118.16 కోట్ల విలువైన 167 కిలోమీటర్ల సిసి రోడ్లు పూర్తిచేయాల్సివుంది. ఇంతవరకు 106.73 కిలోమీటర్లలో సిసి రోడ్లు పూర్తిచేయగా, 51 కిలోమీటర్లలో పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.29 కోట్ల విలువైన 54 కిలోమీటర్ల బిటి రోడ్లలో 7.89 కిలోమీటర్లలో పూర్తిచేశారు. 28.82 కిలోమీటర్లలో రహదారి పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. రూ.76 లక్షల విలువైన 3.91 కిలోమీటర్ల డబ్ల్యుబిఎం రోడ్లలో 2.64 కిలోమీటర్లలో పనులు పూర్తికాగా, 1.27 కిలోమీటర్ల పనులు వివిధ దశల్లో వున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం ఇంకా 26.56 కిలోమీటర్లలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

రోడ్ల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షిస్తోంది. నిర్మాణ పనుల్లో లోపాలను గుర్తించి, పనులను వేగవంతం చేయకపోతే పల్లెలకు కొత్త రోడ్ల నిర్మాణాలన్న మాటలు నినాదాలుగానే మిగిలిపోనున్నాయి.

ఎయు విసిగా రాజశేఖర్

◆ గవర్నర్ ఆదేశాలతో నియామక ఉత్తర్వులు

◆ విశాఖతో ఆయనకు ఎనలేని అనుబంధం

◆ విద్యాభ్యాసంలో అధిక భాగం ఇక్కడే..



రాజశేఖర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఐఐటి ఖరగ్‌పూర్ గణిత శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య జిపి.రాజశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఎయు విసి నియామకానికి సంబంధించిన ఉత్తర్వు లిచ్చింది. ఆచార్య రాజశేఖర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మూడు సంవత్సరాల కాలం కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రస్థానమిలా..

ఆచార్య రాజశేఖర్ టెన్త్, ఇంటర్, డిగ్రీలను విశాఖలోనే ప్రథమ శ్రేణిలో పూర్తి చేశారు. ఎమ్మెస్సీ అప్లైడ్ మ్యాథమెటిక్స్‌ను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో అభ్యసించారు. 1993లో అక్కడే ఎం.ఫిల్‌ను ప్రథమ శ్రేణిలో సాధించారు. 1997లో మ్యాథమెటిక్స్‌లో పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన 27 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. ప్రస్తుతం ఐఐటి ఖరగ్‌పూర్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. 1998లో టోక్యో యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీ (జపాన్) డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ ఫిజిక్స్‌లో జెఎస్‌పిఎస్ పోస్ట్ డాక్టర్ ఫెలోగా పనిచేశారు. 2002లో ఐఐటి ఖరగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన విధుల్లో చేరారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2019లో ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన వద్ద ఇప్పటివరకు 14 మంది డాక్టరేట్ డిగ్రీలను అందుకున్నారు. మరొక నలుగురు ఆయన పర్యవేక్షణలో ప్రస్తుతం పిహెచ్‌డి చేస్తున్నారు. రాజశేఖర్ ఇప్పటివరకు ఆరు పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించారు. 112 రీసెర్చ్ పబ్లికేషన్స్‌ను వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు.

ఆచార్య రాజశేఖర్ 2024లో ఇంటర్నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇండస్ట్రీ ఎలియన్స్ (హాంకాంగ్) నుంచి ఫెలోగా నిలిచారు. 2023లో నేషనల్ మ్యాథ మెటిషియన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అందుకున్నారు. 2022లో మిగతా 2లో..

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

▶ వార్త 6లో..

నేడు తాగునీటి అంతరాయం

▶ వార్త 2లో..

అవకాశమిస్తే మీ గళమవుతా...

▶ వార్త 8లో..



సముద్ర జలాల్లో ఐఎన్ఎస్ రాణా

నేడు ఐఎన్ఎస్ రాణా వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత నావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ రాణా 43వ వార్షికోత్సవ వేడుకలు తూర్పు నౌకాదళంలో బుధవారం జరగనున్నాయి. ఐఎన్ఎస్ రాణా కాషిన్ 2 క్లాస్ డిస్ట్రాయర్ 1982 ఫిబ్రవరి 19న పూర్వపు సోవియట్ యూనియన్‌లో ప్రారంభమైంది. 5000 టన్నుల గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ యుద్ధ కార్యాచరణ సామర్థ్యాన్ని రాణా నావికా దళానికి అందించింది. ఈ నౌకలో అత్యాధునిక స్వదేశీ ఆయుధాలు, సెన్సార్లు ఉన్నాయి. ఉపరితలం నుండి ఉపరితలానికి, ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులను సంధించే సామర్థ్యం దీని సొంతం.

బహుళ పంటల విధానంపై చైతన్యం తేవాలి

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చర్చలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లాభదాయక సాగు విధానాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఆర్థిక ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బహుళ పంటల విధానంపై అందరిలో చైతన్యం తేవాలన్నారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌పై కలెక్టరేట్ మీటింగ్ హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పలు అంశాలపై వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయం, డిఆర్‌డిఎ, సాగునీటి పారుదల శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతుల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, స్థానిక అవకాశాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రకృతి సేద్యానికి, మిల్లెట్లు, బహుళ పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్దా కంపోస్ట్ పిట్ ఏర్పాటు, కిచెన్ గార్డెన్ల పెంపకం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సేద్యం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రత్యేక గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని, వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమూహాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాల న్నారు. రైతు సేవా కేంద్రాలు, ఇతర మార్గాల ద్వారా రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని, అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి మోహనరావు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, సాగునీటి పారుదల శాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఎయు విసిగా రాజశేఖర్

వెస్ట్ బెంగాల్ అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫెలోగా, 2022లో ఇండియన్ మ్యాథమెటికల్ సొసైటీ అకడమిక్ సెక్రటరీగా, 2020లో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఇండియా ఫెలోగా, 2018లో అకాడమీ ఆఫ్ మ్యాథమెటికల్ మోడలింగ్ అండ్ సిములేషన్ జెబిఎస్ గోల్డ్ మెడలిస్టుగా, 2017లో ఏపి అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా నిలిచారు. 2004లో రాయల్ సొసైటీ (యునైటెడ్ కింగ్‌డమ్) ఐఎన్ఎస్ఎ విజిటింగ్ సైంటిస్ట్‌గా, 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డు ఇన్ మ్యాథమెటికల్ సైన్సెస్ ఐఎన్ఎస్ఎగా నిలిచారు. 1998 నుంచి 2000 వరకు జపాన్ సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ సైన్స్ ఫెలోషిప్‌ను, 1992 నుంచి 1994 వరకూ సిఎస్ఐఆర్ జెఆర్ఎఫ్ ఫెలోషిప్‌ను, 1994 నుంచి 97 వరకు సిఎస్ఐఆర్ యుజిసి సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ను పొందారు. పీజీ స్థాయిలో 1990లో ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో 5వ ర్యాంకును, 1993లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో 95.85 శాతం పర్సంటైల్‌ను సాధించారు.

ఉన్నత బాధ్యతల్లో..

2018-19 సంవత్సరాల్లో ఐఐటి ప్లేస్మెంట్ కమిటీ కన్వీనర్‌గా, 2013-14లో గేట్ 2014 ఆర్గనైజింగ్ ఛైర్ పర్సన్‌గా, 2014లో గేట్ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా, 2020లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ సభ్యునిగా పరిపాలనా బాధ్యతలను నిర్వహించారు. ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్ విభాగం డీన్‌గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్‌గా, టెక్నాలజీ విజన్ 2047 వర్క్ షాప్ ఛైర్మన్‌గా, ఐఐటి ఖరగ్‌పూర్ విజన్ 2030 డాక్యుమెంట్ కమిటీ ఛైర్మన్‌గా, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఛైర్మన్‌గా సేవలందించారు.

ఎయు శతాబ్ది ఉత్సవ రథసారథి

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల రథసారథిగా ఆచార్య జిపి.రాజశేఖర్ చరిత్రలో నిలవనున్నారు. 100 ఏళ్ల పండగను జరుపుకోనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ఆయన నియమితులయ్యారు. 2025 ఏప్రిల్ 26న ఎయు 99 సంవత్సరాలను పూర్తి చేసుకోనుంది. ఏడాది కాలం శతాబ్ది సంవత్సరం కొనసాగుతుంది. ఏడాది పొడవునా విభిన్న కార్యక్రమాలను నిర్వహించి 2026 ఏప్రిల్‌లో శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శతాబ్ది వేడుకలను జరుపుకోనున్న తొలి విశ్వవిద్యాలయం ఎయు. ఇటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన వర్సిటీకి ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియామకమయ్యారు. తెలుగు వ్యక్తి, విశాఖ నగరం, ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న ఆయన ఎయు విసిగా రావడం పట్ల ఆచార్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయు నుంచి ఇరువురికి విసి బాధ్యతలు

ఇద్దరు ఎయు ఆచార్యులు రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు నూతనంగా ఉప కులపతులుగా నియమితులయ్యారు. ఎయు ఆంగ్ల విభాగం సీనియర్ ఆచార్యులు ఎ.ప్రసన్నశ్రీ రాజమండ్రిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. అదేవిధంగా ఎయు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు కె.రాంజీ మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే శాఖలో కార్యాచరణ పరిమితుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు 22853 శాలిమార్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 18న, 22854 విశాఖపట్నం - శాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19న, 22807 సంత్రాగచ్చి - ఎంజిఆర్ చెన్నయ్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 21న, 22808 ఎంజిఆర్ చెన్నయ్ - సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 23న రద్దు కానున్నట్టు తెలిపారు.

చోరీ సొత్తు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 జనవరి నెల రికవరీ మేళాను మంగళవారం నిర్వహించారు. చోరీ సొత్తును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సిపి శంఖబ్రత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ జనవరిలో 106 కేసులు నమోదుకాగా 66 కేసులను ఛేదించామన్నారు. 74 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. చోరీ కాబడిన సొత్తులో రూ.47,04,095 విలువగల వస్తువులు, నగదుతోపాటు రూ.45 లక్షల విలువగల 315 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. మేళా ద్వారా బాధితులకు అందజేయనున్నట్టు తెలిపారు. జనవరి నెలలో రికవరీ చేసుకున్న సొత్తులో 310.13 గ్రాముల బంగారం, 536.6 గ్రాముల వెండి, రూ.4,56,495 నగదు, 7 ద్విచక్ర వాహనాలు, కారు, రెండు ఆటోలు, 313 మొబైల్ ఫోన్లు, 4 ల్యాప్‌టాప్‌లు ఉన్నాయన్నారు.

బీచ్ రోడ్డులో అదుపు తప్పిన లారీ

చిల్డ్రన్స్ పార్కులోకి దూసుకెళ్లిన వైనం - ఒకరికి గాయాలు



చిల్డ్రన్స్ పార్కులోకి దూసుకొచ్చిన లారీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులోని నోవాటెల్ వద్ద మంగళవారం ఉదయం 6:50 గంటల సమయంలో ఓ ఇసుక లారీ అదుపు తప్పి చిల్డ్రన్స్ పార్కులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. వాస్తవానికి ఇసుక లోడ్‌తో శ్రీకాకుళం నుంచి ఫిషింగ్ హార్బర్‌కు ఆ లారీ వెళ్లాలి. బీచ్ రోడ్‌లోని ఒక చోట వాకర్స్ ఉన్న సందర్భంగా రోడ్డును బ్లాక్ చేయడంతో రూట్ మార్చిన లారీ డ్రైవర్ ఫిషింగ్ హార్బర్‌కు వేరొక మార్గంలో వెళ్తున్నాడు. నోవాటెల్ డౌన్ దగ్గర ఆ లారీ అదుపు తప్పి చిల్డ్రన్స్ పార్క్‌లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో జనసంచారం పెద్దగా లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ పాదచారికి స్వల్ప గాయాలయ్యాయి. ఆయన్ని చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మహారాణి పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

23న ఐఎంఎ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవం సందర్భాలను పురస్కరించుకొని ఈ నెల 23న సాయంత్రం 5:30 గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్, అధునాతన మహేంద్రజాల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు డాక్టర్ బిఎస్ రెడ్డి తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కార్యక్రమం వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఉత్సవంలో పిసి సర్కార్ తనయుడు జూనియర్ పిసి సర్కార్‌కు స్వర్ణాభిషేకం, జీవన సాఫల్య పురస్కారం అందజేత ఉంటాయన్నారు. మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఎ అవార్డుల ప్ర దానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు తాగునీటి అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ నుంచి వచ్చే ప్రధాన తాటిపూడి పైపులైనుకు గోపాలపట్నం వద్ద మరమ్మతులు చేపడుతున్న కారణంగా జివిఎంసి పరిధిలోని గోపాలపట్నం నుండి కంచరపాలెం మధ్య ఉన్న బల్క్ ఇండస్ట్రీ వినియోగదారులకు గురువారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు బి.మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జనవరి 2025 విద్యాసంవత్సరానికిగాను వివిధ దూరవిద్యా కోర్సులతోపాటూ ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 28వ తేదీ వరకూ పెంచినట్టు ఇగ్నో విశాఖపట్నం బ్రాంచి సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలూ ఆ తేదీ వరకూ లభిస్తాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ ఇగ్నో అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను అందిస్తున్నట్టు చెప్పారు.

ఇంటి స్థలం కబ్జా

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి భానోజితోట రోడ్ నంబర్-7లో కుమారి కొంత మంది వ్యక్తులతో కలిపి తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని జనసేన మహిళా నాయకులు రెయ్యి రత్నం ఆరోపించారు. భానోజీ తోటలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కుమారి దగ్గర తాను రూ.తొమ్మిది లక్షలు అప్పుగా తీసుకున్నానని. దానికి హామీగా, ఖాళీ బాండ్ పేపర్‌పై సంతకం చేశానని తెలిపారు. దీంతో కుమారి వేరే పేపర్లు సృష్టించి తన స్థలాన్ని కబ్జాకు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కుమారిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ ఘటనపై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

వాటర్ ఫిల్టర్ మరమ్మతు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో కూలర్‌తో కూడిన వాటర్ ఫిల్టర్‌ను పాఠశాల పూర్వ విద్యార్థి, ఎపి ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పిసి.అప్పారావు రూ.20 వేల సాయంతో మరమ్మతులు చేసి వినియోగం లోకి తీసుకొచ్చారు. పునరుద్ధరించిన వాటర్ ఫిల్టర్‌ను మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసి.అప్పారావు మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పైడిపల్లి నరసింగరావు, గంటా నూకన్న , పీరుపిల్లి రాంబాబు, ఉపాధ్యాయులు మరగడ రామకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, రామకృష్ణ అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిసి.అప్పారావును విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సస్టైనబుల్ ఎనర్జీ సిస్టమ్స్‌పై ఆన్‌లైన్ ద్వారా మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటి ప్రొఫెసర్ శ్రీహరిరావు, కర్నూల్ ఐఐటి డిఎం అసోసియేట్ ప్రొఫెసర్లు కె.కృష్ణనాయక్, ఎన్.నరేష్ కుమార్, మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ కెఎస్.రెడ్డి, తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ అనిల్ కుమార్, టాటా స్టీల్ సీనియర్ టెక్నాలజిస్ట్ పరమేశ్వరరావు తదితరులు పలు అంశాలపై వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఎనర్జీ సస్టైనబుల్ సిస్టమ్, హ్యాండ్సమ్ ఎక్స్‌పీరియన్స్ తదితర అంశాలపై వక్తలు అన్‌లైన్‌లో ఉపన్యసించారు. ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, అకడమిక్ డీన్ జి.సత్యనారాయణ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతుబజార్‌లో విజిలెన్స్ టీమ్ డిప్యూటీ డైరెక్టర్ పి.పాపారావు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, డిఎటిఎం ఎస్‌కె.యాసిన్, పెందుర్తి ఎఎంసి సెక్రటరీ అరుణ, భీమిలి ఎఎంసి అసిస్టెంట్ సెక్రటరీ శ్రీలక్ష్మి చైతన్య తదితరులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రైతులు పండిస్తున్న పంట వివరాలను విజిలెన్స్ టీమ్ అడిగి తెలుసుకుంది. ఇకమీదట రైతుబజార్‌కు వచ్చే ప్రతి పంటా రైతుల నుంచి నేరుగా తీసుకురావాలని, దళారీల (హోల్‌సేల్) నుంచి కొనుగోలు చేయరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు..

అడుగంటుతున్న భూగర్భజలాలు
జోరుగా తాగునీటి వ్యాపారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉచితంగా అందాల్సిన తాగు నీరు 'ప్రియం'అవ్వడం గమనార్హం. సహజ వనరులన్నీ కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లేలా ఎన్నో ఏళ్లుగా పాలకుల విధానాలు ఉండనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తాగు నీరు సైతం అమ్ముడవుతోంది. జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోనూ, పలు గ్రామాల్లో సైతం పుట్ట గొడుగుల్లా వాటర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. ఇందుకోసం అత్యంత సామర్థ్యం కలిగిన బోర్లు వేసి తాగు నీటిని తోడేసి భారీ ఎత్తున 'నీటి వ్యాపారం' చేస్తున్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్ వద్ద ఒక్కోలా క్యాన్ల ద్వారా తాగు నీరు అమ్ముతున్నారు. ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలు, డిమాండ్ ఆధారంగా లీటర్ ధర రూ.2, రూ.3కు ప్లాస్టిక్ క్యాన్ల ద్వారా అమ్ముతున్నారు. సొంతంగా క్యాన్ తీసుకు వెళ్తే ఒక ధర, నిర్వాహకులే క్యాన్‌తో నీరు ఇస్తే మరో ధర ఇలా అమ్మకాలు జరుగుతున్నాయి. వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, మంజూరుకు విధి విధానాలు ఏమిటన్నది ఏ ఒక్కరికీ అంతుపట్టని ప్రశ్న. సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఏ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న గానే మిగులుతోంది. కోకొల్లలుగా ఏర్పాటైన వాటర్ ప్లాంట్ల నియంత్రణకు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సామాన్య ప్రజలకు చేరేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శేషమ్మ సూచించారు. తోటగరువు ఎర్నిదుర్గ ఫంక్షన్ హాల్లో ఆరిలోవ సిఐ మల్లేశ్వర్రావు ఆధ్వర్యాన మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, వాటికి విధిస్తున్న శిక్షలు, చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చట్టాలకనుగుణంగా పోలీసులు విచారణ చేపట్టాలన్నారు. వీటిపై స్థానిక నాయకులు, రాజకీయ నాయకులు కలుగ చేసుకోకుండా నివారించాలన్నారు. ఎడిసిపి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, ఘోరాలు, గంజాయి మత్తులో యువత అడ్డదారిలో వెళుతున్న వైనం, వాటిని నివారించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, టిడిపి జిల్లా బిసి సెల్ సెక్రటరీ బలగ సుధాకర్, 13వ వార్డు అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శేషమ్మ

ఆలయ నిర్మాణ పనుల సాగదీతపై గంటా ఆగ్రహం

ప్రజాశక్తి-పద్మనాభం : అనంత పద్మనాభస్వామి ఆలయ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దీపోత్సవానికి సిద్ధం కావాల్సిన ఆలయం ఇంకో రెండు నెలలైనప్పటికీ పూర్తి కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పని పురోగతి తెలియజేయడానికి సంబంధిత కాంట్రాక్టర్ గైర్హాజరై, పంపించిన వ్యక్తి పొంతన లేని సమాధానాలు చెప్పడంపై గంటా మండిపడ్డారు. పనులు జరగకపోవడానికి కారణమేమిటని నిలదీశారు. ఫోన్‌లో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ ఆలయం ప్రారంభోత్సవానికి 3 సార్లు గడువు తేదీలు ఇచ్చి విఫలమైన సంగతి గుర్తు చేశారు. ఆలయం పని ఇంకా పెండింగ్ ఉన్నప్పటికీ పనంతా పూర్తయిపోయిందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. నెలరోజుల్లో ఆలయం పనులు మొత్తం పూర్తి చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టి వేరే కాంట్రాక్టర్‌కు అప్పజెబుతామని హెచ్చరించారు. అనుకున్నట్టు పనులు జరగకపోయినా ఎందుకు ఉదాసీనంగా ఉన్నారని దేవస్థానం ఈవో నానాజీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె.లీలావతి, టిడిపి మండల మహిళా అధ్యక్షులు బి.పావని, నాయకులు నందీశ్వరరావు, మహేశ్వరరావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

రెడ్డిపల్లి రోడ్డు పనులు పూర్తిచేయాలి

మండలంలోని రెడ్డిపల్లి మెయిన్ రోడ్డు పనులను మార్చి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. మెయిన్ రోడ్డు పనులు నత్త నడకన సాగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బీటీ రోడ్డుకు అవసరమైన మెటీరియల్‌ను ఇప్పటికే సమకూర్చుకున్నామని, త్వరితగతిన పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రోడ్డు, డ్రెయిన్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గంటా చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోరాడ రమణ, కె.దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కె.లీలావతి, బిఆర్‌బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను విశాఖలో పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ములగాడ : షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి పైల శ్రీరామమూర్తి ఆధ్వర్యాన సింధియా గాంధీ గ్రామ్ కార్మిక బీమా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు పిజెసిహెచ్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : రాయపూర్‌లో జరిగిన జి.సంజీవరెడ్డి జన్మదిన వేడుకలకు విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి సుమారు 15 మంది ఐఎన్‌టియుసి నాయకులు తరలివెళ్లారు. అక్కడ కేక్ కట్ చేసి సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి మంత్రి రాజ శేఖర్, నాయకులు గొందేశి మహేశ్వర్‌రెడ్డి, మద్ది అప్పలరాజు, వైవి.రమణ, సిహెచ్.సుదర్శనం, కె.శ్రీనివాసరాజు, పెద్దాడ నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, మధు, కిలాని ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : భెల్ ఐఎన్‌టియుసి కార్యాలయంలో సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఐఎన్‌టియుసి సీనియర్ నాయకులు తాతారావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.బాబూరావు, వారాడ ఆనందరావు, సీతన్న నాయుడు, ప్రసన్నకుమార్, డి.చిట్టిబాబు, అల్లు అప్పారావు, డి.నరసింహారావు, మురళేశ్వరరావు, సిఐటియు నాయకులు యు.జగన్నాధరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన షీలానగర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. రాంబిల్లి మండలం, వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (23) విశాఖ నగరంలో నివాసముంటున్నారు. ఢిల్లీకి చెందిన ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగ పనిలో భాగంగా గాజువాక వస్తుండగా షీలానగర్ జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డు మీద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఆయన్ను కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో చనిపోయారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విష్ణు విల్లా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పదో తరగతి విద్యార్థిని కె.సాస ఆత్మహత్యకు పాల్పడింది. వారు ఉంటున్న అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకి దూకేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. నాలుగో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీతమ్మధారలోని ప్రెసిడెన్షియల్ స్కూల్‌లో బాలిక చదువుతోంది. బాలిక ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

బైక్ ఢీకొని తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎగువ పేట జెడ్‌పి అతిథి గృహం రోడ్డు మార్గంలో సోమవారం సాయంత్రం హోండా ఏక్టివా స్కూటీ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు బిఇడి విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. సిఐ సుధాకర్ కథనం ప్రకారం.. స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల హాస్టల్‌లో ఉంటూ దొరతోట రోడ్డులో ఉన్న సెడార్ కళాశాలలో సవర సుజాత, పాంగి శ్రావణి బిఇడి సెకండ్ ఇయర్ చదువుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు హాస్టల్‌కు వసున్న క్రమంలో హోండా యాక్టివా వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సవర సుజాత కాళ్లకు, చేతులకు గాయలవ్వగా, శ్రావణి తల రోడ్డుకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అరుణచికిత్స నిమిత్తం వారిద్దరినీ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సలహా మేరకు తీవ్ర గాయాలైన శ్రావణిని 108లో కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. విద్యార్థిని సుజాత ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మాకవరం గ్రామంలో ఈనెల 13న జరిగిన దొంగతనం కేసులో నిందితున్ని అరెస్టు చేసి అతని నుంచి రెండు తులాల బంగారం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్ తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం విలేకరుల సమావేశంలో నిందితుడిని హాజరు పరిచి కేసు వివరాలు వెల్లడించారు. మాకవరం గ్రామానికి చెందిన గంజి మంగరావు ఈనెల 13న అదే గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఇంటిలో దొంగతనం చేసి రెండు తులాల బంగారు వస్తువులను అపహరించాడు. దీనిపై బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి డిఎస్‌పి శ్రావణి ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐ కే.అప్పలనాయుడు, సిసిఎస్ ఎస్సై పీ.రమేష్, రూరల్ ఎస్సై జి.రవికుమార్, ముద్దాయిని మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు బైక్ దొంగతనం కేసులో ముద్దాయిగా కూడా ఉన్నాడు.

ప్రయివేటీకరణ ఆపేవరకూ పోరాటం



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపేవరకూ పోరాడతామని పోర్టు సిఐటియు నాయకులు జె.సత్యనారాయణ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 142వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోర్టు ఏటా రూ.వేల కోట్లు లాభాలు సంపాదిస్తున్నా, ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. దాంట్లో నాలుగో వాటా ఖర్చుపెట్టినా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. ఈ రకంగా ఆలోచించకుండా ప్రయివేటుకు ధారాదాతత్వం చేయాలని ఆలోచించడం దుర్మార్గం అన్నారు.

పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రయివేటీకరణపై తీసుకున్న నిర్ణయం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, ఎస్.సాధుబాబు, జిసి హెచ్‌వై.నాయుడు, రాజగోపాలరావు, సిహెచ్‌విఎస్.రెడ్డి, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి శంకరమఠం క్రోన్ బేకరీ ఎదురుగా మూడు రోజుల నుంచి రోడ్డుమీద మంచి నీరు వృథాగా పోతోంది. జివిఎంసి నీటి సరఫరా విభాగం సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదు. ఈ రహదారిలో వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జివిఎంసి నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

కల్వర్టు పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులో రూ.6.5 లక్షలతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను వేగవంతంచేయాలని స్థానికులు కోరుతున్నారు. వార్డులోని గణేష్‌నగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులు నెల రోజులుగా జరుగుతున్నాయి. కల్వర్టు నిర్మాణానికి రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పనులు వేగవంతమయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఉక్కునగరంలో ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ సెంటర్ ప్రారంభంలో కార్పొరేటర్ గంగారావు తదితరులు

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 78వ వార్డు పరిధి ఉక్కునగరంలో ఆధార్ స్పెషల్ క్యాంప్ మంగళవారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 28వ తేదీ వరకు స్పెషల్ క్యాంప్ ఉంటుందని వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. కొత్తగా ఆధార్, ఆధార్‌లో తప్పులు, అడ్రస్, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్ల సవరణ, బయోమెట్రిక్ అప్డేషన్‌తోపాటు డాక్యుమెంట్, డాక్యుమెంటేషన్ అప్డేషన్ చేసుకోవడానికి సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, సిఐటియు నాయకులు పుల్లారావు, రాజా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు శిథిలం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డులో నూతనంగా వేసిన రోడ్లలో నాణ్యత లేకపోవడంతో శిథిలమవుతున్నాయి. రోడ్డు కొంత భాగం లోపలికి కుంగిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మధురానగర్ హైస్కూల్ వద్ద, సీతంపేట దుర్గ గణపతి ఆలయం వెనక వేసిన రోడ్డు పలుచోట్ల శిథిలమై కనిపిస్తున్నాయి. నూతనంగా వేసిన రోడ్డు పాడవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతా లోపం లేకుండా పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి విద్యార్థీ ఆఫర్ లెటర్ సాధించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : పీజీ పరీక్షలు పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థీ ఆఫర్ లెటర్ చేత్తో పట్టుకువెళ్లాలని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ప్లేస్మెంట్ ఆఫీసర్ వైవి.రెడ్డితో కలిసి ఫైనల్ ఇయర్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ తమ అభిరుచికి తగిన రంగాన్ని ఎంపిక చేసుకొని, అందుకు తగిన నైపుణ్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. దీనికి తగిన అన్ని ఏర్పాట్లు విశ్వవిద్యాలయం చేసిందని చెప్పారు. ప్లేస్మెంట్ డైరెక్టర్ వైవి.రెడ్డి మాట్లాడుతూ, నిరంతరం విద్యార్థులను ఉద్యోగులుగా మార్చే పనిలో ఉన్నామని, వివిధ సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. అందరూ వివిధ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం ప్లేస్ మెంట్ ట్రైనర్ డాక్టర్ జికెడి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం



భీమిలిలో శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, ఎంఇఒలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాలను పలుచోట్ల మంగళవారం ప్రారంభించారు.

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి యుపి పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్తాధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి, ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట, పాట, వివిధ కృత్యాలు నేర్పించడం, అభివృద్ధి, పురోగతిని అంచనా వేయడం, అభ్యాసనను మెరుగుపరిచే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పిలు కె.సన్యాసి నాయుడు, హరిణి, డిఆర్‌పిలు, పలువురు సిఆర్‌పిలు పాల్గొన్నారు. భీమిలి అర్బన్, రూరల్ నుంచి 86 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు తొలి విడత శిక్షణా తరగతులకు హాజరయ్యారు.

ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ జోగ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల విద్యాభ్యాసానికి పునాదులు వేయడానికి జ్ఞాన జ్యోతి కార్యక్రమం దోహద పడుతుందన్నారు. 120 రోజుల పాటు నిర్వహించే ఈ జ్ఞాన జ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ దేవుడుబాబు, ఎంఇఒ-1 జోగేంద్రనాథ్, ఎంఇఒ-2 కె.గంగరాజు, డిఆర్‌పి ఉమామహేశ్వరరావు, రాంబాబు, రఘురాముడు, రత్నం, రేఖవాణి, సిఆర్‌పిలు ఎస్.శివాజీ, బి.గౌరీశంకర్రావు, జె.శివాజీ, వెంకట్రావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్స్ ట్రైనింగ్‌ను పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిక్షణ 6 రోజులు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.రమణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలామణి పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను ఎంఇఒ నరేష్, ఐసిడిఎస్ అధికారులు ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు వారి స్థాయిని బట్టి అర్థమయ్యే రీతిలో బోధించే విధానం తదితర అంశాలపై అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఇఒ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం మండలంలోని 76 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఆరురోజుల జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎంఇఒలు తిరుపతిరావు, సింహాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రాథమిక, సెకండరీ విద్యలో పునాది అభ్యసనం నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఐసిడిఎస్ సిడిపిఒలు అనిత, శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలను పాఠశాలకు వెళ్లడానికి సిద్ధం చేయడం ద్వారా పునాది అభ్యసన నాణ్యతను బలోపేతం చేయడం, బోధనా నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు యస్.గణేష్, ఎ.రవి కుమార్, బి.సురేష్ పాల్గొన్నారు.

వడ్డాది : జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 బి.కాశీ విశ్వేశ్వరరావు, రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎస్.పుష్పాదేవి కోరారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది కేపిడి జెడ్పీ హైస్కూల్లో ఆరు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ శిక్షణకు మండలంలోని 64 మంది అంగన్వాడీ టీచర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పివి.శేషుబాబు, సూపర్వైజర్లు రత్నం, రాజా రాజేశ్వరి, సంతోషి కుమారి, కెఆర్పిఆర్ఎన్ ప్రసాద్, డిఆర్పీలు దేగల నారాయణ, పీవీ నారాయణ, శేషగిరిరావు, గొలుగొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలను ఎంఇఒలు ఎస్ లక్ష్మణరావు, రవీంద్రబాబు, ఐసిడిఎస్ సిడిపిఒ లలిత కుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునాది అభ్యాసన, భాష సంఖ్యాశాస్త్రంలలో సామర్థ్యాన్ని పెంపొందించుటకు ఈ శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, విద్యా శాఖ డిఆర్పీలు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను నియంత్రించాలి

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలపై జరుగుతున్న వేధింపులను నియంత్రించాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి సమీపంలో ఉన్న సఖి వన్ స్టాప్ సెంటర్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివలకు సఖి వన్ స్టాప్ సెంటర్ అండగా నిలుస్తుందన్నారు. బాధిత మహిళలు "సఖి వన్ స్టాప్ సెంటర్" సహాయం పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 181ను సంప్రదించాలని కోరారు. లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్సైట్ల ద్వారా జరిపే నేరాలు, ఇంటి నుంచి గెంటేయడం, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చెయ్యవచ్చని తెలిపారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సఖీ కేంద్రంలో సైకో సోషల్ కౌన్సెలింగ్, లీగల్ కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైతే పోలీసుల సహాయం కూడా తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. అతివల సమస్యల సత్వర పరిష్కారానికి, రక్షణ కల్పించేందుకు "సఖి వన్ స్టాప్ సెంటర్" ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఇందులో పోలీసు, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ విభాగాలకు చెందిన సిబ్బంది ఉంటారన్నారు. 5 నుంచి 10 రోజుల వరకు ఆశ్రయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. సహాయం కొరకు వచ్చిన బాధిత మహిళలు ఉండేందు ఏర్పాటు చేసిన గదులు, వంటగది, కౌన్సిలింగ్ రూమ్, మెడికల్ చెకప్ రూమ్, స్టాఫ్ రూమ్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. సహృద్భావంతో వ్యవహరిస్తూ బాధిత మహిళలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి అనంతలక్ష్మి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైలు యమునా, ఈశ్వరరావు,"సఖి వన్ స్టాప్ సెంటర్" అడ్మినిస్ట్రేటర్ ఎంవి.మంజులవాణి, నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, సూపరింటెండెంట్ పద్మ కళ, సీనియర్ అసిస్టెంట్ మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా చట్టాల బుక్ లెట్‌ను అందిస్తున్న దృశ్యం

సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి : సంఘ విద్రోహ వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ఎస్పి తుహిన్ సిన్హా తన కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగం నివారణ, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళలు, బాలల హక్కులు, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై విస్తృతంగా చర్చించారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఈ అంశాలపై అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ సహకారంతో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక భూమిక పోషించాలని సూచించారు. సమాజాన్ని సురక్షితంగా, చట్టపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా ప్రభావాన్ని ఉపయోగించి యువతను సరైన దిశలో నడిపించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ట్రైనీ డీఎస్పీ ఎంవి.కృష్ణ చైతన్య, ఐటి కోర్ ఎస్సై సురేష్ బాబు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పరవాడ : మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల గౌరవ అధ్యక్షురాలు పి మాణిక్యం ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. పరవాడ మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవ వేతనం గత మూడు నెలలు నుండి చెల్లించలేదని, తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.10వేలు ఇవ్వాలని, ఐడి కార్డు, యూనిఫామ్, ప్రమాద బీమా సౌకర్యం, పిఎఫ్ కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, పిల్లలకిచ్చే మోను చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం వరహాలమ్మ, జి నూకరత్నం, వై లక్ష్మి, ఎడ్ల నారాయణమ్మ, ఎస్ కుమారి, చుక్క దేముడమ్మ, బి లక్ష్మి, సిహెచ్ దేముడమ్మ, పి దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, సావిత్రిబాయి పూలే స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే కాకుండా దేశంలో ఎంతోమంది అవయవదాన లోటుతో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మన అవయము మరొకరికి ఉపయోగపడితే సంతోషాన్ని పొందాలని విద్యార్థులకు సూచించారు. సావిత్రిబాయి పూలే సంస్థ ప్రతినిధి బాలు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి వ్యక్తి అవయవ దానం ఇంకొకరికి ప్రాణదానం నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. కన్య కుమారి మాట్లాడుతూ తన కుటుంబంలో కిడ్నీ దానం చేయుటకు అనేకమంది వ్యతిరేకించినా, తను ధైర్యంతో ముందుకు వచ్చానని, ప్రతి విద్యార్థి ఖరీజ్, కాన్ఫిడెన్స్, కాన్సిస్టన్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సవరం టైపింగ్ ఇనిస్ట్యూట్ ప్రిన్సిపల్ బాబ్జి మల్లిబాబు, జి వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రత్న భారతి, డి.మాల్యాద్రి, బి. పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో హాకీ పోటీలు

ప్రజాశక్తి-యలమంచిలి : రానున్న మార్చి నెలలో గుంటూరులో సీనియర్ మెన్ హాకీ పోటీలు జరగనున్నాయని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి నరేశ్ మంగళవారం తెలిపారు. జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 20వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమౌతాయని పేర్కొన్నారు. ఈ పోటీలు డిగ్రీ కాలేజీ రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతాయని ఆయన తెలిపారు.

రేషన్ డిపోల్లో తహశీల్దారు తనిఖీ

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాక 1, 2 రేషన్ డిపోలను తహశీల్దారు ఆదిమహేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిపోలలో ఉన్న స్టాకును, తూనిక యంత్రాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ రాజేశ్వరి, కోనపల్లి రామ్మోహన్ రావు, ఆడారి వేణుగోపాలరావు, కాండ్రేగుల మణికంఠ, ఎం మహేష్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెంలో మంగళవారం సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 24 మందిని క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని క్యాంపు కోఆర్డినేటర్ ఆర్ స్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికుమార్, డాక్టర్ వైష్ణవి, పి గీత సాయి, సంతోషి, గాంధీ సంఘ సభ్యులు కన్నూరు అప్పలనాయుడు, పల్ల శ్రీను, మంగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పుల పంపిణీకి హైరానా

ప్రజాశక్తి-యలమంచిలి : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను గుర్తించడానికి, వారికి ఓటరు స్లిప్పులు అందించడానికి రెవెన్యూ సిబ్బంది నానా హైరానా పడుతోంది. అటు టీచర్ అనుబంధ సంఘాలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే ఉపాధ్యాయుల చిరునామా గుర్తించడంలో తీవ్ర అసహనానికి గురౌతున్నారు. చిరునామా ఒక చోట, పనిచేసేది మరో చోట కావడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు వారిని గుర్తించడంలో కాస్త సఫలమౌతున్నా, రెవెన్యూ శాఖ మాత్రం వారి టార్గెట్‌ను రీచ్ కాలేకపోతోంది. ఓటరు స్లిప్పులు పంపిణీలో బాగా వెనుకబడిందని తెలుస్తోంది. వాట్సాప్‌ల్లో కూడా వారి సమాచారం కోసం వెతుకులాట కనిపించింది.

లలితా ఫెర్రో పరిశ్రమ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఈజెడ్ పరిధిలో గల రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులకు రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వద్ద మంగళవారం ఆయన పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జనవరి 23న కరెంట్ బిల్లు కట్టలేదని ఈపిడిసిఎల్ కరెంటు నిలుపుదల చేసినట్లు చెప్పారు. అప్పటినుండి కార్మికులు కంపెనీ తెరుస్తారు జీతాల వేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు నిరంతరం కంపెనీ విధులకు హాజరవుతున్నారని, సోమవారం బి షిఫ్ట్ విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమ యాజమాన్యం విధులకు రావద్దని చెప్పడంతో కార్మికులు అవాక్కయ్యారని తెలిపారు. రెండు నెలల జీతాలు కార్మికులకు చట్టప్రకారం రావలసిన బకాయి వేతనాలు చెల్లించకుండా, ఎటువంటి ముందస్తు సమాచారం తెలపకుండా పక్కన పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం లేబర్ అధికారులు జోక్యం చేసుకొని లలితా పరిశ్రమను యధావిధిగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని రాము డిమాండ్ చేశారు.



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

అత్యాచారం కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ.3 లక్షల జరిమానా
- బాధిత బాలికకు రూ.10 లక్షల పరిహారం
- పోక్సో కోర్టు తీర్పు

ప్రజాశక్తి -అనకాపల్లి

అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ విశాఖపట్నం ఫోక్సో కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. అలాగే బాధిత బాలికకు రూ.3 లక్షలు నిందితుడు, రూ.7 లక్షలు ప్రభుత్వం మొత్తం 10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం తెలియజేశారు. సబ్బవరం మండలం నాయనమ్మ పాలెం గ్రామానికి చెందిన ఎర్ర నవీన్ 2019వ సంవత్సరంలో పెందుర్తిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసగించి అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. బాధితురాలు పెళ్లి చేసుకోమని నిందితుడిని కోరినా, అతను తిరస్కరించడంతో పాటు అతని తల్లిదండ్రులు కూడా తమకు సంబంధం లేదని చెప్పారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది.

ప్రతి రైతూ ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రతి రైతూ ఈ క్రాప్ పోర్టల్‌లో నమోదు కావాలని, ఎరువులు ఇతర రైతు సౌకర్యాలు రాయితీపై పొందాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం రాత్రి ఆమె మండలంలోని మేడిచర్ల గ్రామంలో వరి పంట పొలాలను సందర్శించారు. పంట దిగుబడి వివరాలను రైతులను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి ఇచ్చిన సమాచారంతో సంతృప్తి చెందిన రైతులను అభినందించారు. రాత్రివేళ పొలంలోకి వెళ్లి పిల్లి పెసర పంటను పరిశీలించి పంట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయదారులకు రాయితీపై విత్తనాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఇన్చార్జి తహశీల్దార్ డి రమేష్ బాబు, ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపిఆర్‌డి రమణి, మేడిచర్ల వ్యవసాయ శాఖ అధికారి హరీష్, లైలా దేవి, మండల విద్యాశాఖ అధికారులు డివిడి ప్రసాదు, సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాత్రి సమయంలో పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

క్రికెట్ బెట్టింగులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : త్వరలో ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగులపై పోలీస్ శాఖ దృష్టి సారించాలని ఉత్తరాంధ్ర చర్చావేదిక నాయకులు బుద్ధ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో దొరికిన బుకీలను పిలిపించి వారి మీద నిఘా పెట్టి కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. ఈ క్రికెట్ బెట్టింగ్ల వల్ల అభం శుభం తెలియని 15 నుంచి 30 సంవత్సరాలు వయసు గల పిల్లలు నష్టపోయి ఈ బుకీలు పెట్టే హింసలు భరించలేక గత మూడు సంవత్సరాలుగా అనకాపల్లిలో సుమారు 50 నుంచి 100 మంది వివిధ రూపాల్లో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ బుకీల మీద పోలీస్ శాఖ నిఘా పెట్టాలని కోరారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

తొలివిడత శిక్షణలో పోలింగు అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఓలు, ఏపీఓలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగు నిర్వహించాలని సూచించారు. శిక్షణ సమయంలో ఎన్నికల ప్రక్రియను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఎటువంటి సందేహాలున్నా, వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలని కోరారు. పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణలో వ్యవధి ఎక్కువ పట్టే అవకాశం ఉన్నందున ఓపిగ్గా, సంయమనం పాటిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపు, నమోదు, సిరామార్కు, బ్యాలెట్ పేపరు అందజేయడం, తిరిగి తీసుకోవడం వంటి పనులు క్రమపద్ధతిలో నిర్వహించాలని కోరారు. ఓటరు ఓటు వేయుటకు పోలింగు సామగ్రితోపాటు అందజేసిన పెన్ను మాత్రమే వినియోగించాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారులు డి.పి.ఆర్.సి. జిల్లా కోర్డినేటరు నాగలక్ష్మి, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు, డిప్యూటీ తహశీల్దారు పి.అరుణ చంద్ర ఎన్నికల నిబంధనలు, పోలింగు విధానం, బ్యాలెట్ బాక్సులు నిర్వహణపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న దృశ్యం



కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

గాంధీ గ్రామంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో గాంధీ గ్రామపంచాయతీలో సర్పంచ్ గాడి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడిక తీయించి రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి శుభ్రంగా చేశారు. ఈ పనులను ఎంపీడీవో జి ఆంజనేయులు, పిఓపిఆర్డి మహేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నామని తెలిపారు. వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నక్క రామునాయుడు, కారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : జగతి పబ్లికేషన్స్ అందజేసిన స్టడీ మెటీరియల్స్‌ను మండలంలోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 98 మంది పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు భయం విడనాడితే మంచి మార్కులతో విజయ సాధిస్తారని తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె రాము, మాజీ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు బీరా సత్యారావు, స్కూల్ కమిటీ చైర్మన్ కే గణపతమ్మ స్వామి, ఉప సర్పంచ్ నక్క శ్రీను, వార్డు మెంబర్ మజ్జి ఆనంద్, స్కూల్ కమిటీ సభ్యులు జి సత్తిబాబు, వై కాశి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న బాలికలు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు 97045 50032, 63011 19688 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వికలాంగులకు తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పొందుతున్న 128 మంది వికలాంగులకు తనిఖీలు నిర్వహించారు. కంటి సంబంధిత, మానసిక రోగులు మంగళవారం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో హాజరయ్యారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో తనిఖీలు పూర్తి అయ్యాక అంగవైకల్యం నిర్ధారించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పెన్షన్లు పంపిణీ కొనసాగనుంది. సదరం ధ్రువపత్రాలకు అనుగుణంగా అంగవైకల్యం లేకపోతే వచ్చే నెల నుండి వారి పెన్షన్లు ఆగిపోనున్నాయి. ఈ శిబిరాన్ని బుచ్చియ్యపేట ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఐకెపి ఏపీఎంఓ రాజబాబు, సిబ్బంది సందర్శించారు. సోషల్ వర్కర్ ఆకుల నాగేశ్వరరావు వికలాంగులకు సహాయ సహకారాలు అందించారు.

గ్రామాల్లో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి, కలిగొట్ల, తిమిరాం, బోయిలకింతాడ గ్రామాల్లో ఎంపిడిఒ ఎంవి.సువర్ణ రాజు మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఎన్ఆర్ఇజిఎస్ కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఆయా పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, హెల్త్ సెంటర్లు, సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బంది. పనితీరును పరిశీలించారు. శానిటేషన్ సంబంధించిన విషయాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ పివిపి త్రినాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి


ప్రజాశక్తి-అనకాపల్లి : భారత హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు సిపిఐ మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ కోడుగంటి గోవిందరావు 11వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన వై.విజయ్ కుమార్ హాల్లో "వ్యవసాయరంగం పెనుసవాళ్ళు" అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గోవిందరావు అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో రైతు సంఘం, వన సంరక్షణ సమితి నిర్మాణంలోనూ, రైతు సమస్యల పరిష్కారం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. నేడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక అవసరాల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం భూమిని వాడుకోవడం వల్ల వ్యవసాయ భూమి కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో నుండి బయటపడాలన్నా, అభివృద్ధి చెందాలన్నా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, కెఎస్ సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, బూసి పరమేశ్వరి, వియ్యపు రాజు, బాబ్జి, ఫణీంద్ర, పోతురాజు, మాధవరావు, శంకర రావు, దేముడుబాబు పాల్గొన్నారు.

ఎంపీ సిఎం.రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట

అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర తెలుగు రైతు అధికారి ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రేమ సమాజంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రేమ సమాజానికి నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. త్రిపురవారిపాలెం గ్రామానికి చెందిన వికలాంగుడు పిల్లిబొయిన రాముకు గొంతిన శ్రీనివాసరావు సొంత నిధులతో రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణారావు, కలగ సోమేశ్వరరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, ఎస్‌కే.బాబర్, కలిగేట్ల సింహాద్రి, బుదిరెడ్డి గంగయ్య, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకు నాయుడు, మళ్ల బాబు, షేక్ దర్గా పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఎంపీ సీఎం రమేష్ పుట్టినరోజు వేడుకలు మండలంలోని కోమల్లపూడిలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుచ్చయ్యపేట పిహెచ్‌సిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డోంకిన అప్పలనాయుడు, పూడి రామారావు, తాటికొండ కనకార్జునరావు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి : పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ జన్మదిన సందర్భంగా మంగళవారం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మల్ల సురేంద్రతోపాటు పలువురు కూటమి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి రామనగర్ టడ్కో ఇళ్ల సముదాయంలో భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఇళ్ల సముదాయంలోని ప్రతి బ్లాక్ నుండి పిండి వంటలు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. పలు సాంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఆహ్వాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి ప్రసాద్, హైరామ్ పర్యవేక్షించారు.

పలు గ్రామాల్లో పండగ మహోత్సవాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెంలో గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ కోవెల నాగమణి, గ్రామ పెద్దలు కోవెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన వారు అమ్మవారి పండుగకు స్వగ్రామానికి చేరుకున్నారు.

పరవాడ : మండలంలోని వాడ చీపురుపల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీరామచంద్రమ్మ అమ్మవారి పండుగ మహొత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసరపు అప్పలనాయుడు, జనసేన, టిడిపి నాయకులు పంచకర్ల ప్రసాద్, బోద్దపు శ్రీనివాస్, వియపు చిన్నా, మోటూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని బిఆర్టి కాలనీ, రామాపురం కాలనీలో శ్రీనల్లమారమ్మతల్లి, బవులవాడలో శ్రీపైడితల్లిమ్మ తల్లి పండగ మహోత్సవాలు జరిగాయి. సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ స్వామి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి అమ్మవారులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను దుస్సాలువా వేసి షీల్డ్ ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మళ్ళ శ్రీనివాసరావు, పోలమరశెట్టి నూకరాజు, కోన శ్రీనివాసరావు ఎంఎం నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం పంచాయతీలో శ్రీదుర్గాలమ్మ తల్లి తీర్థ మహొత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థ మహొత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమిన ఆయకులు గండి వంశీ, ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, కర్రి కనకరాజు, పిబివిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కుంచంగి గ్రామంలో మంగళవారం దుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుంచంగి గ్రామ సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి నాగేశ్వరరావు, పల్లెల సాయి కిరణ్, ఆలయ కమిటీ చైర్మన్ నడిపల్లి దేవరాయలు, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, మలసాల కుమార్ రాజా పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం విజయరామరాజుపేట 20న జరగబోయే శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర మహొత్సవానికి గ్రామ కమిటీ ఆహ్వానం మేరకు మంగళవారం వైసిపి నేత మలసాల భరత్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. వైపిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, పాల్గొన్నారు.

పందూరు వంతెన పూర్తయ్యేనా.?

- పనులు చేపట్టి దశాబ్దమైనా ఇంకా పిల్లర్ల దశలోనే...
- ఐదేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణం
- కూటమి పాలకుల హామీపైనే ప్రజల కొండంత ఆశలు


పదేళ్లుగా పిల్లర్లు దశలోనే నిలిచిపోయిన పందూరు వంతెన


దిష్టిబొమ్మలా మిగిలిపోయిన అయ్యన్న వేసిన శంకుస్థాపన ఫలకం

ప్రజాశక్తి -కోటవురట్ల : పందూరు వంతెన నిర్మాణంతో అధికార ప్రతిపక్ష నాయకులు రాజకీయ ప్రచార క్రీడ నిర్వహిస్తున్నారు, దశాబ్ద కాలం క్రితం రూ.6 కోట్లతో ప్రారంభించిన వంతెన నిర్మాణ పనులు నేటికీ పిల్లర్ల స్థాయిలో దర్శనమిస్తున్నాయి, నాటి టిడిపి ప్రభుత్వం 2015లో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు ప్రారంభించిన వంతెన పిల్లర్ల స్థాయి వరకు నిర్మాణాలు చేపట్టారు, అయితే 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు, దీంతో వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన దొంగలి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయి, 2023 -లో జగనన్న ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావును స్థానికులు నిలదీసినప్పటికీ ఇసుమంతైనా స్పందన లేదు 2024 జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లోఅప్పట్లో అధికార వైసిపి అభ్యర్థిగా పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పోటీచేసిన కంబాల జోగులు మరోమారు శంకుస్థాపన పనులు ప్రారంభించారు, అప్పట్లో ఎన్నికల స్టంట్‌గా దీన్ని అభివర్ణించిన ప్రస్తుత ఎమ్మెల్యే, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, శంకుస్థాపన శిలాఫలకం వద్ద అదంతా ఎన్నికల మాయ అంటూ ప్రచారంలో ఎద్దేవా చేశారు. దీనిపై నిరసన కూడా చేపట్టారు. అంతేకాకుండా టిడిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో పందూరు వంతెన పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా పందూరు వంతెన వైపు కన్నెత్తిచూసిన పాపాన పోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో కీలక మంత్రి పదవిలో ఉంటూ వంతెన నిర్మాణంపై వంగలపూడి అనిత దృష్టి సారించకపోవడంతో స్థానికులతోపాటు మండల వ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతుంది, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో హోంమంత్రికి 20 ర్యాంకు రావడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. పందూరు వంతెన పూర్తిచేయడంపై ఆశలు సన్నగిల్లుతున్నాయని పలువురు అంటున్నారు 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగనున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోపందూరు వంతెన ఎటు కలిసిపోతుందో, ఏమై పోతుందోనని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో పందూరు వంతెనకు మోక్షం కలుగుతుందని ఆశాభావవ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడైనా పనులు మొదలుపెట్టి, పూర్తిచేయకుంటే, పందూరు వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోనుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పందూరు వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

పశుగణన అమలు పరిశీలన

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలోని అర్జునగిరి, తురువోలు రైతు సేవా కేంద్రాలను మంగళవారం వి. మాడుగుల పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వి చిట్టినాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు .ప్రస్తుతం జరుగుతున్న 21వ పశు గణన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు సర్వే పూర్తి చేశారు, ఇంకా ఎన్ని ఇళ్లకు సర్వే చేయాలి, దానికి ఏ విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి డేటా సరిగా తీసుకున్నది లేనిదీ పరిశీలించారు.ఇప్పటివరకు మండలంలో 50శాతం ఆవులు, గేదెలు, 70శాతం గొర్రెలు, మేకలు గణన పూర్తి అయినట్లు తెలిపారు.కార్యక్రమంలో అర్జునగిరి, తురువోలు పశు సంవర్ధక సహాయకులు గంగునాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - రావికమతం: మండల కేంద్రంలో విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు, ఎంపిపి పైలా రాజు, వైసిపి మండల కన్వీనర్ జగ్గారావు,మాజీ మండల ఉపాధ్యక్షులు గంటా ఈశ్వరరావు తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లను చేశారు.

నేటి నుంచి దుర్గాలమ్మ జాతర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని పూర్ణా మార్కెట్ సమీపంలో ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.శేఖర్ బాబు మీడియాకు తెలియజేశారు. బుధవారం ఉదయం 10.15 గంటలకు శ్రీ అమ్మవారి రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20న నాగవల్లి దళార్చన, తమలపాకులతో అమ్మవారిని అలంకరిస్తామన్నారు. 21న శాకంబరి అలంకారం, 22న పుష్పాలంకరణ, 23న సౌభాగ్య లక్ష్మి అలంకారం, గాజులతో అమ్మవారి ముస్తాబు ఉంటాయన్నారు. 24న సాయంత్రం 4 గంటలకు దేవస్థానం ఆవరణలో దీపాలంకరణ జరుగుతుందన్నారు. 25న తోలేళ్ళ మహోత్సవం, 26న మహ శివరాత్రి వేడుకలు నిర్వహిస్తామని, ఆ రోజు ఉదయం 5 గంటల నుండి కుంకుమార్చనలు, శూలాల పండగ, అగ్ని గుండాలు తొక్కుట ఉంటాయన్నారు. రాత్రి 12 గంటలకు శ్రీ అమ్మవారి నేత్రోత్సవం, తొలి పూజ అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 27న శ్రీ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా చేపడతామన్నారు. వచ్చే నెల 6న మారువారం పండగ జరుగుతుందని, 108 రకాల వంటకాలతో అష్టోత్తర శతపదార్ద నివేదన ఉంటుందని అన్నారు. అదే రోజున ఐదు వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గంలోని 33వ వార్డు పారిశుధ్య విభాగంలో పేర్లు ఉన్నప్పటికీ పారిశుధ్య పనులు చేయకుండా జీతాలు తీసుకుంటున్న వారిని వెనక్కి రప్పించి వార్డుల్లో పారిశుధ్య పనులు చేసేలా చూడాలని డిమాండ్ చేస్తూ వార్డులోని పలువురు పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. పారిశుధ్య పని చేసే చెత్తను ఎత్తాల్సి ఉంటుందని తలంచి కొంతమంది ఇతరులు ద్వారా సిఫార్సులు చేయించుకొని జోనల్ కార్యాలయాలకు వెళ్లిపోయారని తెలిపారు. దీంతో తమపై పని భారం పడుతోందని అన్నారు. ఇప్పటికైనా జోనల్ కార్యాలయాలకు వెళ్లిన వారిని వార్డు పరిధిలోకి తీసుకువచ్చి పనులు చేయించాలని డిమాండ్ చేశారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసు పయనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్ స్టేషన్ నుండి కుంభమేళాకు ప్రత్యేక బస్ సర్వీసును మంగళవారం విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా ఏడు రోజులపాటు వివిధ పుణ్యక్షేత్రాలు చూపించి, కుంభమేళా ప్రయాగరాజ్ చేరుకొని, తిరిగి ఆ సర్వీసు విశాఖపట్నం చేరుతుందన్నారు. ఈ ప్రత్యేక బస్సు ఏర్పాటుపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిబిఎస్.రాజు పాల్గొన్నారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు మరొక బస్సును ఈ నెల 20న నడపనున్నామని అధికారులు తెలిపారు. టికెట్ ధరను రూ.8 వేలుగా నిర్ణయించామని, టికెట్స్ కావలసినవారు వివరాలకు 7095605769, 8978200455 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పదెకరాల జీడితోటలు దగ్ధం

జి కొత్తపల్లిలో అగ్నిప్రమాదం : రూ.లక్ష ఆస్తి నష్టం

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు పది ఎకరాల జీడి తోటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. సంఘటనకు సంబంధించి కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూర్యనారాయణ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు, అడిగర్ల సత్యం, బొడ్డు సన్ని బాబు, జాగారపు సూర్యనారాయణలకు చెందిన జీడి తోటలు పూత దశలో ఉన్నాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి జీడి తోటలు దగ్ధం కాగా పూత మాడిపోయిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చోడవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, అగ్ని మాపక శాఖ హెడ్ కానిస్టేబుల్ సిరికి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారన్నారు. బాధితులను పరామర్శించి తమకు జరిగిన నష్టాన్ని అధికారులకు తెలియజేస్తామన్నారు.


దగ్ధమైన జీడితోటలు

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

ప్రజాశక్తి - నక్కపల్లి :చిన్నారుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ డి సీతారామరాజు సూచించారు. మంగళవారం మండలంలోని రాజయ్యపేట సచివాలయంలో ఆధార్ నమోదు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో 0-6 పిల్లలకు ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను ఏర్పాటు చేశామని, తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకునేలా చూడాలని సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

మైదానంలో ఒంటె విహారం


నక్కపల్లిలో ఒంటె

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎడారిలో సంచరించే ఒంటె మైదాన ప్రాంతంలో కనిపించడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. అడ్డు రోడ్డు వైపు నుంచి ఒక వ్యక్తి ఒంటెను నక్కపల్లి వైపుగా తీసుకువచ్చాడు. ఎడారి ప్రాంతంలోనూ, జూలో కనిపించే ఒంటె మైదాన ప్రాంతంలో కనిపించడంతో దారిన పోయేవారు ఒంటెను ఆసక్తిగా తిలకించారు.

హెల్మెట్‌ధారణపై..

పోలీసుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నర్సీపట్నం డిఎస్‌పి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు, స్థానిక నాయకులతో కలిసి 100 బైక్‌లతో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లి పోలీస్‌స్టేషన్ నుండి అడ్డరోడ్ వరకు, తిరిగి వెదుళ్లపాలెం జంక్షన్ వరకు బైక్‌లపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం భారం కాదని, బాధ్యత అని గుర్తించి ప్రయాణం సాగించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు సాగించేటప్పుడు ప్రమాదాలు బారిన పడితే,హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయస్థితి నుండి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ర్యాలీలో పోలీసులు, స్థానిక నాయకులు, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

నేడు రావికమతం మండల సమావేశం

ప్రజాశక్తి - రావికమతం : రావికమతం మండల సర్వసభ సమావేశం ఈనెల 19న బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వెంకన్నబాబు తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, కోడ్ నియమ నిబంధనలు అనుసరించి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతి నిధులు అందరూ విధిగా హాజరుకావాలని తెలిపారు. అధికారులు డుమ్మా కొట్టినట్లైతే,అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమావేశానికి వచ్చేటప్పుడు పూర్తి సమాచారంతో హాజరు కావాలనికోరారు.

అవకాశమిస్తే మీ గళమవుతా...

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - టెక్కలి, సంతబొమ్మాళి, ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, పరిణామాలను వివరించి తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలోని పది రకాల యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని చెప్పారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పనిచేశారని గుర్తుచేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.గణపతిరావు, జిల్లా అకడమిక్ సెల్ కో-కన్వీనర్ బి.రాజు, కె.పాపారావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, టి.వైకుంఠరావు, తమ్మినేని పాపారావు, పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలసలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

విజయగౌరిని గెలిపించండి

ఉభయ గోదారి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ గోపీమూర్తి



నాతవరంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి- నాతవరం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని ఉభయగోదారి జిల్లాల పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలో విజయగౌరిని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసిన అనుభవం ఉన్న విజయగౌరిని గెలిపిస్తే, శాసనసమండలిలో వారి తరపున తన వాణిని వినిపించి, విద్యా, ఉపాధ్యాయరంగ సమస్యలను పరిష్కరించగలుగు తుందన్నారు. విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటేసి మంచి మెజార్టీతో గెలిపించడం ద్వారా ఒక మహిళాఉద్యమకారణిని శాసనమండలికి పంపించే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి, చిట్టయ్య, మహేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి విజయాన్ని కాంక్షిస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజా ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముషిడిపల్లి, ఏ.కొత్తపల్లి, ఎం.అలమండ, వేచలం, పెదనందిపల్లి, కాశీపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, కెజిబివి తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి విజయగౌరికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, మండల అధ్యక్షులు పెద్దాడ వెంకట రమణ, జిల్లా కార్యదర్శి దొగ్గ శ్రీనివాస్, వేచలపు నాగేశ్వరరావు, కోరతం కృష్ణ, ప్రకాశ్ పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ఎన్నికల ప్రచారంలో యుటిఎఫ్ నేతలు

అంతా ఇన్‌ఛార్జీల మయం

ప్రజాశక్తి-కోటవురట్ల : కూటమి ప్రభుత్వ పాలనలో మాకవరపాలెం మండలంలో ఇన్‌ఛార్జీల పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఒబిసి చైర్మన్ బొంతు రమణ అన్నారు, మండల తహశీల్దారు, ఎంపిడిఒ, మండల విద్యాశాఖ అధికారితోపాటు పలువురు ఇన్‌ఛార్జిలు కావడంతో వివిధ పనులు, ధ్రువపత్రాలకు వచ్చే ప్రజలతో పాటు రైతులు విద్యార్థులు,ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా ప్రధానమైన ఆయా శాఖలకుపూర్తిస్థాయి రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరారు.

ప్రధాన రహదారిపై మురుగునీరు!

గోతులమయం, అపారిశుధ్యంతో అవస్థలు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

మండిపడుతున్న చౌడువాడ గ్రామస్తులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో చౌడువాడ గ్రామం ప్రధాన రహదారి అపారిశుధ్యానికి నెలవుగా దర్శనమిస్తుంది. దీంతో గ్రామ ప్రజలతోపాటు రహదారిపై వెళ్లే వాహనదారులు విద్యార్థులు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ అనకాపల్లి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం వందలాదిగా వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తూ ఉంటాయి, ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో గోతులు ఏర్పడడంతోపాటు ఆయా గోతుల్లో మురుగునీరు నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వాహనాలు రాకపోకల సమయంలో మురుగునీరు ఇతర వాహనాలు, పాదచారులపై వెదజల్లబడడంతో వాటి దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. మరోవైపు మురుగునీటి నిల్వతో దోమలు విజృంభించి, వాటివల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్అండ్‌బి ప్రధాన రహదారి అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో, గడచిన ఐదేళ్లుగా మండలసభల్లో ఇదే సమస్యను ప్రస్తావించినప్పటికీ, ఇసుమంతైనా స్పందన లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని, ప్రధాన రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టడంతో పాటు ఇప్పటికే రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చేసి శాశ్వత మరమ్మతులు చేపట్టి, మురుగు ఇబ్బందుల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.



చౌడువాడలో ఆర్అండ్‌బి రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు